# పోలాల అమావాస్య

శ్రీమతి కె.విజయలక్ష్మి

(ఆగస్టు 21 పోలాల అమావాస్య)



వ్రతాల మాసంగా ప్రసిద్ధి చెందిన శ్రావణమాసంలోని వ్రతాలలో పోలాల అమావాస్య వ్రతం ఒకటి. దీనిని శ్రావణ మాసంలోని బహుళ పక్ష అమావాస్యనాడు ఆచరిస్తారు. శ్రావణ అమావాస్యకు "పోలామావాస్య" అని పేరు. దీనికే పోలాల అమావాస్య, పోలాలమావాస్య పోలాంబవ్రతం వంటి పేర్లు కూడా వున్నాయి. ఈ వ్రతాన్ని ఆచరించడం వల్ల పిల్లలకు అపమృత్యు భయం తొలగిపోయి ఆయురారోగ్యాలు వర్ధిల్లుతాయని చెప్పబడుతోంది.

ఈ వ్రతానికి సంబంధించి ఆసక్తికరమైన గాథ ప్రచారంలో వుంది. పూర్వం ఒక గ్రామంలో బ్రాహ్మణ దంపతులు నివసిస్తూ వుండేవారు. వారికి ఏడుగురు కుమారులు కలిగారు. యుక్త వయస్సు రాగానే వారందరికీ వివాహాలు చేశారు. వారికి సంతానం కూడా కలిగింది. ఆ ఏడు మంది తల్లిదండ్రుల నుంచి వేరై అదే గ్రామంలో విడివిడిగా నివసించసాగారు. తమ సంతానం బాగా వుండాలంటే 'పోలాంబ' అమ్మవారిని శ్రావణమాసంలో అమావాస్యనాడు పూజిస్తూ వ్రతం చేయాలని విన్న ఆ ఏడు మంది శ్రావణమాసం కోసం ఎదురు చూడసాగారు. శ్రావణమాసం వచ్చింది. అనేక వ్రతాలు ఆచరించారు. చివరి రోజు అయిన అమావాస్య నాడు పోలాంబ వ్రతం ఆచరించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే వ్రతం రోజు ఉదయాన్నే ఏడవ కోడలి కుమారుడు మరణించాడు. అందువల్ల వ్రతం చేయలేకపోయారు. మరుసటి సంవత్సరం వ్రతం చేసేందుకు ప్రయత్నం చేశారు. కానీ మళ్ళీ ఆ సంవత్సరమూ ఏడవ కోడలి మరో బిడ్డ మరణించింది. దీనితో వ్రతం చేయలేకపోయారు. ఈ విధంగా ప్రతిసంవత్సరం వ్రతం చేసేందుకు ఏర్పాట్లు చేసుకోవడం... ఆ రోజు ఉదయం ఏడవ కోడలి బిడ్డ మరణించడం వ్రతం చేయలేకపోవడం.. ఈ విధంగా ఏడు సంవత్సరాలు జరిగింది. మిగతా ఆరుమంది కోడళ్ళు ఏడవ కోడలి వల్ల వ్రతం చెడిపోతూ వుంది అని తిట్టుకోసాగారు. ఆమెకు ఎక్కడా లేని దుఃఖం కలుగుతూ వుండేది.

మరుసటి సంవత్సరం అంటే ఎనిమిదవ సంవత్సరం వ్రతానికి అవసరమైన ఏర్పాట్లు అన్నీ చేసుకున్నారు. అయితే ఆ రోజు ఉదయమే ఏడో కోడలి బిడ్డ చనిపోయింది. ఈ విషయం తెలిస్తే అందరూ నిందిస్తారని, వ్రతం తన వల్ల ప్రతి సంవత్సరం చెడిపోతూ వుందని కోప్పడతారని భయపడ్డ ఆమె తన బిడ్డ మరణించిన విషయాన్ని బయటకు చెప్పకుండా... చనిపోయిన బిడ్డ శరీరాన్ని ఇంటిలో వుంచి తోటి కోడళ్ళతో కలిసి వ్రతంలో పాల్గొంది. అందరూ ఆనందంలో వ్రతం చేస్తూ వున్న... తాను మాత్రం యాంత్రికంగా వ్రతంలో పాల్గొంది. రాత్రి వరకూ అలాగే గడిచింది. చీకటి పడి గ్రామం సద్దుమణిగిన అనంతరం చనిపోయిన బిడ్డను భుజాన వేసుకుని గ్రామ పొలిమేరలో వున్న పోలేరమ్మ గుడి వద్దకు చేరుకుని, గుడి ముందు తన బిడ్డ మృతదేహాన్ని వుంచి, తన పరిస్థితిని తలుచుకుని దుఃఖించసాగింది.

అప్పుడు పోలేరమ్మ అమ్మవారు గ్రామసంచారం ముగించుకుని అక్కడికి-చేరుకుని ఆమెను చూసి ఆ సమయంలో ఏడుస్తూ తన వద్దకు రావడానికి కారణం అడిగింది. దీనితో ఆమె గత ఎనిమిది సంవత్సరాలుగా జరుగుతున్నదంతా వివరించింది.

వీటన్నింటినీ విన్న పోలేరమ్మ అమ్మవారు

ఎంత గొప్పవాళ్ళయినా కష్టాలు రాకమానవు. అప్పుడు ఇతరుల సహాయసహకారాలు ఎంతైనా అవసరం.

కరుణించి ఆమెకు అక్షతలు యిచ్చి పిల్లలను కప్పిపెట్టిన చోట వాటిని చల్లి పిల్లలను వారివారి పేర్లతో పిలువమని చెప్పింది. అదేవిధంగా చేసింది. చిత్రంగా చనిపోయిన పిల్లలందరూ నిద్ర నుంచి లేచి వచ్చినట్లుగా లేచి వచ్చారు. వారందరినీ తీసుకుని పోలేరమ్మ అమ్మవారికి నమస్కరించి ఇంటికి చేరుకుంది.

మరునాడు ఉదయం గ్రామంలోని వారందరికీ ఈ విషయం వివరించింది. అందరూ సంతోషించారు. అంతేకాకుండా అప్పటి నుంచీ అందరూ ప్రతిసంవత్సరం ఈ వ్రతం చేయడం ప్రారంభించినట్లు కథనం.



## ఈ వ్రతం ఎలా చేయాలి?

'పోలేరమ్మ అమ్మవారు' గ్రామదేవత. దాదాపు ప్రతి ఊరి పొలిమేర్లలో అమ్మవారు కొలువుదీరి పూజలందుకుంటూ వుంటుంది. పోలేరమ్మ సంతానం లేనివారికి సంతానం ప్రసాదిస్తుందనీ, సంతానం కలిగిన వారికి కడుపు చలువ చేస్తుందని విశ్వాసం. అటువంటి దేవతను పూజిస్తూ చేసే వ్రతమే ఇది.

వ్రతం రోజు తెల్లవారుఝామునే నిద్రలేచి కాలకృత్యాలు తీర్చుకుని తలస్నానం చేసి ఇంటిని శుభ్రపరచుకుని మహిళలు తమ పిల్లలను వెంటబెట్టుకుని పోలేరమ్మ ఆలయానికి వెళ్ళి పూజలు చేసి ఇంటికి చేరుకుని వ్రతం చేయవలెను. పసుపుతో పోలేరమ్మను చేసుకుని పూజ చేయదలచిన చోట ఏర్పాటు చేసుకున్న పీఠంపై బియ్యంపోసి దానిపైన నెలకొల్పవలెను. ముందుగా వినాయకుడిని పూజించి తర్వాత అమ్మవారిని షోడశోపచారాలు, అష్టోత్తరాలతో పూజించవలెను. సాధారణంగా గౌరీదేవిని అర్చించినట్లుగానే పోలేరమ్మను అర్చిస్తారు. పూజ ముగించిన తర్వాత పసుపు రాసిన దారానికి పసుపు కొమ్మును కట్టి 'తోరము' తయారు చేసుకుని పూలతో పూజించాలి. తోరమును ఒకదానిని అమ్మవారికి సమర్పించాలి. మిగతా తోరములను పిల్లల మెడలో వేయాలి. తర్వాత పెరుగన్నము నైవేద్యంగా సమర్పించి దానినే ఆ రోజు ఆహారంగా స్వీకరించాలి. తిరిగి సాయంత్రం, మరునాడు పూజ చేసి వ్రతం ముగించవలెను.

ఈ విధంగా వ్రతం ఆచరించడం వల్ల సంతానం లేని వారికి సంతానం కలుగుతుంది. సంతానానికి అపమృత్యు భయం తొలగిపోయి, ఆయురారోగ్యాలు వర్ధిల్లుతాయని శాస్త్రవచనం. •

## శ్రీశైలప్రభ చందా చెల్లింపు

**వార్షిక చందా: రూ. 116-00,**
**శాశ్వత చందా : రూ. 1200-00**
(15 సంవత్సరాల కాలపరిమితితో)

శ్రీశైలప్రభ వార్షిక/శాశ్వత చందాలను అన్నదాన భవన సముదాయంలోగల దేవస్థాన ప్రచురణల విక్రయ కేంద్రంలో, క్షేత్రంలో పలుచోట్ల ఏర్పాటు చేయబడిన కియాస్క్ (విక్రయకేంద్రం)లలో చెల్లించవచ్చు. తపాలద్వారా చందాలను పంపేవారు మనీ ఆర్డర్ లేదా డిమాండు డ్రాఫ్టు ద్వారా చందా పంపవలసి వుంటుంది. మనీఆర్డర్ ద్వారా చందా మొత్తమును పంపునప్పుడు, మనీఆర్డర్ కూపన్ పై శ్రీశైల ప్రభ చందా నిమిత్తమై పైకమును పంపుతున్నట్లుగా స్పష్టంగా తెలియజేయవలెను. వివరములు లేనియెడల సదరు మొత్తం హుండీఖాతాలో జమజేయబడుతుంది.

డిమాండు డ్రాఫ్టు ద్వారా చందాలను చెల్లించే వారు చందామొత్తాన్ని ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, శ్రీశైల దేవస్థానం, శ్రీశైలం పేరుతో ఆంధ్రా బ్యాంకు, కెనరా బ్యాంకు లేదా స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, శ్రీశైలంలో కాని చెల్లుబాటగునట్లుగా పంపవలెను.

**చందాలు పంపవలసిన చిరునామా**

పబ్లిషర్ మరియు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, శ్రీశైలప్రభ,
శ్రీశైల దేవస్థానం శ్రీశైలం - 518 101.
ఫోన్ : 08524 - 288886

బలంగా వున్నప్పుడు చుట్టం తోడ్పడతాడు.
బలం తగ్గినప్పుడు చుట్టమే శత్రువవుతాడు.